క్లుప్తంగా

రాజీనామా

కొడకండ్ల: పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పదవికి రాజీనామా చేసినట్లు నక్క యాకస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి అంకితభావంతో పనిచేశానని, గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి గెలుపులో భాగస్వామ్యం వహించడంతో సంతోషంగా ఉందని, కొత్త వారికి అవకాశం దక్కాలనే లక్ష్యంతోనే తాను పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

అనాథల మధ్య పుట్టినరోజు వేడుకలు



చిల్పూరు: మండలంలోని లింగంపల్లి పంచాయతీ పరిధిలోని కొమ్ముగుట్టకు చెందిన వెల్దె వినయ్ దంపతులు కూతురు మైత్రి పుట్టినరోజు వేడుకలను హనుమకొండలోని ఒయాసిస్ ట్రస్ట్‌లో అనాథ పిల్లల మధ్య శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆనందంగా గడిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బచ్చన్నపేట: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మండలంలోని సాల్వాపూర్ గ్రామం వద్ద పోలీసులు శుక్రవారం వారం పట్టుకున్నారు. ఎస్సై కంకల సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన భూక్య రమేష్ టాటా ఏస్ ఆటోలో తరలిస్తున్న 14 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా ఈ బియ్యం ఆటోను పట్టుకుని స్థానిక పోలీస స్టేషన్‌కు తరలించారు. ఆటోను సీజ్ చేసి రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

బీజేపీ మండల కార్యవర్గం

రఘునాథపల్లి: బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ శుక్రవారం ప్రకటించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులుగా అశ్వరావుపల్లి గ్రామానికి చెందిన దైతల రంజిత్‌కుమార్ గౌడ్, కుర్చపల్లికి చెందిన చల్లా వాసుదేవరెడ్డి, ఉపాధ్యక్షులు ఆకుల రామచంద్రం (భానాజీపేట), దోరగొల్ల రవి (ఇబ్రహీంపూర్), రంగు రాజశేఖర్‌గౌడ్ (ఖిలాషాపూర్), కార్యదర్శులు కావటి ప్రవీణ్ జాఫర్‌గూడెం, చెవ్వ రాజు (మేకలగట్టు), పుట్టల అశోక్ (వెల్ది), అధికార ప్రతినిధిగా తోట మహేష్ (రామరాయనిబంగ్లా), యువ మోర్చా అధ్యక్షుడిగా బొల్ల రాజ్‌కుమార్, కిసాన్‌మోర్చ దుకిరె మహేందర్, ఓబీసీ మోర్చా ముప్పిడి అనిల్, దళిత మోర్చా ఊద్గుల మహేష్, గిరిజన మోర్చా అధ్యక్షుడిగా ధీరావత్ కిషన్‌లను నియమించినట్లు వేణుకుమార్ పేర్కొన్నారు.

బియ్యం అందజేత



దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరుకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పెరిక కోటేష్ భార్య లలిత మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి 50 కిలోల బియ్యం శుక్రవారం అందజేశారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఎంపీటీసీ గిరి, రాములు, శ్రీశైలం, మహేందర్, సోమయ్య, ఎల్లయ్య, భాస్కర్, నరేష్, రాజు పాల్గొన్నారు.

'దందాలు చేసే సంస్కృతి ఝాన్సీరెడ్డికి లేదు'

తొర్రూరు: పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తప్ప, ఇసుక, భూములు, గ్రానైట్స్ వంటి దందాలు చేసే సంస్కృతి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డికి లేదని డీసీసీబీ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్ రావు అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అమెరికాలో నిజాయితీగా సంపాదించుకొని, అందులో కొంత నియోజకవర్గ ప్రజలకు ఖర్చు పెట్టేందుకే రాజకీయాలకు వచ్చారన్నారు. తన కోడలును ఎమ్మెల్యేగా గెలిపించి, నిరంతరం ప్రజా సేవ కార్యక్రమాలతోపాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేస్తుందన్నారు. ఈసమావేశంలో కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, అనుమాండ్ల తిరుపతిరెడ్డి, సుంచు సంతోష్, సోమరాశేఖర్, శ్యాంసుందర్‌రెడ్డి, పెదగాని సోమయ్య, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశంగౌడ్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

క్రీస్తు జీవితం ఆదర్శనీయం

గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. గ్రామాల్లోని పలు వీధుల్లో సిలువ మార్గంలో క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరై ఏసుప్రభును స్తుతిస్తూ ప్రార్థనలు చేశారు. పలువురు మాట్లాడుతూ క్రీస్తు శిలువపై మరణం చెందిన రోజును బాదాతప్త హృదయాలతో గుడ్ ఫ్రైడే జరుపుకుంటారన్నారు. ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శనీయమని, ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలన్నారు. కార్యక్రమంలో ఫాదర్లు, క్రైస్తవ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



చిల్పూరు: మల్కాపూర్‌లో..



స్టేషన్‌ఘన్‌పూర్: ర్యాలీ తీస్తున్న క్రైస్తవులు



రఘునాథపల్లి: కంచనపల్లి శాంతిగిరిలో..



దేవరుప్పుల: బాలయేసు హైస్కూల్‌లో..



బచ్చన్నపేట: చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

దేవతామూర్తులకు పుష్పార్చన



పుష్పార్చన అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

దేవరుప్పుల: మండలంలోని కడవెండి రెవెన్యూ పరిధి దేవునిగుట్టపై దేవతామూర్తులకు సహస్ర పుష్పార్చనలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం దేవునిగుట్టపై కొనసాగుతున్న లక్ష్మీనృసింహస్వామి జాతర పురస్కరించుకొని ఆలయ పూజారి బీట్కూరి సంపత్‌కుమాచార్యులు పర్యవేక్షణలో బ్రహ్మణులు ప్రత్యేక అలంకరమలు చేసి అభిషేకం పూజలు చేశారు. నల్లగొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గుట్ట సమీపంలో పురాతన కడవెండి నివాసిత ఆనవాల ప్రాంతంగా వెలుగొందిన క్రమంలో విశిష్టత కలిగిన హనుమాన్ ఆలయం వద్ద పూజారి ఉప్పల సురేష్‌బాబు భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.

ప్రతీ ఒక్కరికి అండగా ఉంటాం..



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

పాలకుర్తి: బీఆర్‌ఎస్, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన ప్రతీ ఒక్కరికి అండగా ఉంటామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌లు, పార్టీ గ్రామ అధ్యక్షులు ఇతర నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కాగా, వారికి యశస్మినిరెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యేను నాయకులు సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ రాఘవరావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, యాకసోమయ్య, ఎస్సీ సెల్ భాస్కర్, హరిదాస్, రాజేశ్ యాదవ్ పాల్గొన్నారు.

ఐలేష్ యాదవ్ ఆరోగ్యం బాగుండాలి

తిరుపతికి తీగారం గ్రామం నుంచి సైకిల్ యాత్ర చేస్తున్న బైకాని ఐలేష్ యాదవ్ ఆరోగ్యం బాగుండాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే సైకిల్‌పై తిరుమతిరుపతికి యాత్ర చేస్తానని ఐలేష్ యాదవ్ చేసిన ప్రతిజ్ఞను ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. శుక్రవారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐలేష్ నూతన సైకిల్ తీసుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, పసులాది వెంకటేశ్, పోగు శ్రీనివాస్, మొగుళ్ల కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బేతి కుమార్, మోగుల్ల అంజయ్య, బైకాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఝాన్సీరెడ్డి

కొడకండ్ల: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి అన్ని నియోజకవర్గాలకంటే భారీ మెజార్టీని అందించి పాలకుర్తి నియోజకవర్గ సత్తా చాటాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ఆధ్వర్యంలో రేగుల మాజీ సర్పంచ్ కల్సాని వెంకట్‌రెడ్డితో పాటు వివిధ గ్రామాల నుంచి 100 మంది బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ఆడబిడ్డలుగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తాను నిత్యం తోడునీడగా ఉంటామని, పార్టీలో కొత్త పాత తేడా లేకుండా అందరు కలసికట్టుగా పార్టీ అభ్యున్నతికి పాటుపడాలని, చేరికలు కేవలం నూతన ఉత్సాహాన్ని తీసుకొచ్చి పార్టీ అభివృద్ధికి దోహదపడుతాయనే తప్ప పార్టీ కోసం గత అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అన్యాయం చేయడం కోసం ఏమాత్రం కాదని, కష్టపడి పనిచేసిన వారందరికి సముచిత గౌరవం, గుర్తింపునిస్తూ కంటికి రెప్పలా కాపాడుకొంటామని అన్నారు. కుటుంబాన్ని సైతం వదిలేసి పాలకుర్తి ప్రజల మధ్యంలో ఉంటున్నామని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుపాలన్నదే తమ ఏకైక సంకల్పమని అన్నారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, జిల్లా కార్యదర్శి సోమనర్సయ్య, నాయకులు ప్రసాద్‌రెడ్డి, సునీల్ రెడ్డి, అంజయ్య, భిక్షపతి, శ్రీవర్ధ, మనోహర్, వంశీకృష్ణ, రవీందర్, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలి



అధికారులతో సమీక్షిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

దేవరుప్పుల: ఎన్నికల కోడ్ ఉన్నందున సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో స్థానిక ఎస్సై ఎస్.చెన్నకేశవులుతోపాటు భద్రతా దళాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల సరిహద్దు ప్రాంతాలపై నిఘా పెంచుతూ కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టాలన్నారు. జనగామ–సూర్యాపేట రహదారితోపాటు అనుసంధాన గ్రామాల దారుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం మొండ్రాయివద్ద ఏర్పాటు చేసి చెక్ పోస్టును తనిఖీ చేసి దేవరుప్పుల, కొడకండ్ల పోలీసుల పర్యవేక్షణ కొరవడకుండా చూడాలని ఆదేశించారు.

శ్రీహరిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



కడియం శ్రీహరితో ఘన్‌పూర్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కడియం కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే ప్రచారంతో ఘన్‌పూర్‌కు చెందిన కడియం అనుచరులు శుక్రవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో కడియం శ్రీహరిని కలిశారు. బీఆర్‌ఎస్ పార్టీ లోక్‌సభ బరి నుంచి కడియం కావ్య హఠాత్తుగా తప్పుకోవడం, శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం కావడంతో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి కడియం శ్రీహరి వర్గీయులు హైదరాబాద్‌కు హుటాహుటిన బయలుదేరి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు. కాగా, నేడు హైదరాబాద్‌లో ఉదయం 9 గంటలకు నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కడియం వర్గీయులతో ప్రత్యేక సమావేశం కానున్నారు. శ్రీహరిని కలిసిన వారిలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, నాయకులు బూర్ల శంకర్, నీల గట్టయ్య, అన్నం బ్రహ్మారెడ్డి, వంగాల జగన్‌మోహన్‌రెడ్డి, తోట వెంకన్న, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు తదితరులు ఉన్నారు.

ముగిసిన రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారంలో శాలివాహన కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పలువురు నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయాల వద్ద బైండ్ల వారు మేక పిల్లను గావు పట్టి ఆలయంపై, పలువురు ఇళ్లపై సరుగు వేశారు. అనంతరం ఆయా కులస్తులు ఆలయాల వద్ద జంతు బలులు ఇచ్చి వ్యవసాయ బావుల వద్దకు వన భోజనాలకు వెళ్లారు. బంధువులు, ఆడపడుచుల రాకతో గ్రామాలన్నీ సందడిగా మారాయి. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు కృషి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నర్మెట: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపుకోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మినారాయణ అన్నారు. జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాలతో నర్మెట టౌన్ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్ అధ్యక్షతన మండల కేంద్రంలోని కేఎస్సార్ గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు బీఆర్‌ఎస్ అవినీతిని ప్రజల్లో ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూక్య జయరాం, ఎంపీటీసీ కళ్యాణం మురళి, పీఏసీఎస్ డైరెక్టర్ కూకట్ల చంద్రమౌళి, జిల్లా, మండల నాయకులు చెవుల పరశురాములు, దేవులపల్లి భాగ్యలక్ష్మి, తాజామాజీ సర్పంచ్ కుంటి జగన్, మాజీజడ్పీటీసీ గాదె మోహన్ రెడ్డి, బుర్ర రాజుగౌడ్, వలబోజు శ్రీనివాస్, పండ్ల బాలనర్సు, శివరాత్రి మహేష్, బాల్ సింగ్ మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి పిలుపునిచ్చారు. గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనుకయ్య అధ్యక్షతన శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సంక్షేమ పథకాలు అమలుచేయడం జరిగిందన్నారు. సమావేశంలో యాకూబ్, ఎర్ర సిద్ధులు, చిక్కొండ పోషయ్య, ఎర్రవెల్లి పోషయ్య, సిరిగిరి దాసు, తలకొక్కుల రవి, పోషిరెడ్డి, గోరంతల వీరన్న, దామెర లూకా తదితరులు పాల్గొన్నారు.

కడియం శ్రీహరి రాజీనామా చేయాలి

జఫర్‌గఢ్: రాజకీయ స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తున్న కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామ చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లెపాటి జైపాల్‌రెడ్డి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలుపునకు కార్యకర్తలు, ఉద్యమకారులు కష్టపడ్డారన్నారు. ఆయనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే..స్వార్థ రాజకీయాల కోసం పార్టీని వీడడం సరికాదన్నారు. తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కడియం బీఆర్‌ఎస్ ద్రోహి..

జనగామ రూరల్: తనను కష్టపడి గెలిపించిన కార్యకర్తలను మోసం చేసి పార్టీకి తీవ్ర ద్రోహం చేసిన మొదటి వ్యక్తి కడియం శ్రీహరి అని, దీనిని ప్రజలు క్షమించరని రాబోయే కాలంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం ఒక ప్రకటనలో అన్నారు. కడియం కాంగ్రెస్‌లోకి పోతాననడం సరికాదన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి, రెండు సార్లు ఎమ్మెల్సీ, ఒక సారి ఎమ్మెల్యేగా గెలిచిన కడి యం పార్టీ మారడం నీచమైన చర్య అని అన్నారు.

ఆర్థికసాయం



చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి లత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు నారగోని రవిచంద్ర పరామర్శించి రూ. 10వేల సాయం శుక్రవారం అందజేశారు. గనగోని రమేష్, ఉట్కూరి సునయ్, డిష్ వెంకన్న, శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్ ఉన్నారు.

'ప్రతిఒక్కరూ మక్కాను సందర్శించాలి'



షరీఫ్, రఫీ, మోమీన్‌లను సన్మానిస్తున్న ముస్లింలు

జనగామ రూరల్: పవిత్ర రంజాన్ మాసంలో సౌదీ అరేబియాలోని మక్కా మసీద్‌ను ప్రతి ఒక్కరూ సందర్శించి రావాలని అడ్వకేట్ జమాల్ షరీఫ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జామియా మసీద్‌లో నమాజ్ అనంతరం జనగామ నుంచి మక్కాకు వెళ్లి వచ్చిన జమాల్ షరీఫ్‌తో పాటు ఎండీ రఫీ, అబ్దుల్ మోమీన్‌లను ముస్లింలు ఘనంగా పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ అల్లాను దర్శిస్తే ఎంతో పుణ్యం వస్తుందని చెప్పారు. షబీర్, మహ్మద్ ముజాబ్, అబ్దుల్ రహీం, సల్మాన్, ఎండీ ఎజాజ్, తదితరులు ఉన్నారు.

'ఎంపీ టికెట్ మాదిగలకే ఇవ్వాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ పార్లమెంట్ టికెట్ మాదిగలకే ఇవ్వాలని జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, స్టేషన్‌ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి ఎస్సీ మూడు పార్లమెంట్ స్థానాలకు గాను రెండు మాదిగేతరులకే ఇచ్చారని, కనీసం వరంగల్ స్థానాన్ని అయినా మాదిగలకు ఇవ్వాలని ఆయన అధిష్టానాన్ని కోరారు. వరంగల్ పార్లమెంట్ నియోజవకర్గంలో మెజార్టీ ఓటర్లు మాదిగలే ఉన్నారని, మాదిగల అస్థిత్వానికి భంగం కలుగకుండా ఎంపీ టికెట్ మాదిగలకు ఇవ్వాలని ఆయన కోరారు. కాంగ్రెస్ దళితుల పక్షపాతి అనే ప్రగాఢ నమ్మకం దళితుల్లో ఉందని, వారి నమ్మకాన్ని నిలబెడుతూ వరంగల్ ఎంపీ స్థానాన్ని మాదిగలకు కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిపించి అధిష్టానానికి కానుకగా అందిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి చేయూత

చిల్పూరు: మండలంలోని ఫత్తేపూర్‌కు చెందిన భూక్య లాలమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. రెక్కాడితే డొక్కాడని కుంటుంభం కావడంతో గ్రామానికి చెందిన భూక్య మోహన్ ఫత్తేపూర్ గ్రామం వాట్సాప్ గ్రూప్‌లో బాధిత కుటుంబాన్ని ఆదుకొనేందుకు దాతలు ముందుకు రావాలని మెస్సేజ్ పెట్టాడు. పలువురు స్పందించి పంపిన రూ. 29,410లను బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు.

ఆలయాల అభివృద్ధి కమిటీ ఎన్నిక



ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు

జఫర్‌గఢ్: స్థానిక ఆలయాల అభివృద్ధి కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. రామాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా మంచాల ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, కమిటీ గౌరవ అధ్యక్షుడిగా అన్నెబోయిన భిక్షపతి, వైస్ చైర్మన్‌గా తాటికాయల యాకయ్య, కోశాధికారిగా అంచూరి యుగేందర్, సలహాదారులుగా ఈరభత్తిని అంజయ్య, కమిటీ సభ్యులుగా జ్యోతి యాకయ్య, నంచర్ల యాదగిరి, మొగిళిపాక నర్సింగం, కన్న సోమశేఖర్, పి.విజయ్‌గౌడ్, తాటికాయల రాజేందర్, నల్ల–బోయిన రాజు, సింగారపు రమేష్, దాంశెట్టి సోమన్న, సముద్రాల ఎల్లయ్య, మాతరాశి రమేష్, ఠాకుర్ రంజిత్‌సింగ్ చవనబోయిన సోమనర్సయ్య తదితరులు ఎన్నికయ్యారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



జనగామ రూరల్: ప్రముఖ హోమియోపతి వైద్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ కరోనా సమయంలో చేసిన వైద్యసేవలకు కర్నాటక ప్రభుత్వం నుంచి ఎక్సలెన్స్ అవార్డు ఇటీవల అందుకున్నారు. కాగా, శుక్రవారం ఆయనను పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పరమేశ్వర్, వేముల బాలరాజు, గాదె వెంకట్రామయ్య, సీనియర్ జర్నలిస్టు చింతకింది క్రిష్ణ మూర్తి,దొర్నాల వెంకటేశ్వర్లు, రమేష్, పాము మోహన్, సందీప్, సూర్యనారాయణ పాల్గొన్నారు.